క్లుప్తంగా

'ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం'



పెర్కిట్(ఆర్మూర్): అభివృద్ధి విషయంలో ఆర్మూర్ ఎమ్మెల్యేను ఎవరు విమర్శించినా ఊరుకునేది లేదని జెడ్పీటీసీ సంతోష్, పిప్రి, మంథని గ్రామాల సర్పంచ్‌లు ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి, పుట్టింటి లింబారెడ్డి హెచ్చరించారు. ఇటీవల కురిసిన భారి వర్షానికి ఆర్మూర్ మండలం పిప్రి, మంథని గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. పిప్రి, మంథి గ్రామాల మధ్య వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి రూ. 2.30 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారన్నారు.

బోధన్ ఏసీపీకి సత్కారం



బోధన్ రూరల్ (బోధన్) : బోధన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన కేఎం కిరణ్ కుమార్‌ను శనివారం బోధన్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగ ఉపాధ్యక్షులు జక్క సంజీవ్ పటేల్ నాయకులతో కలిసి శాలువలతో ముక్తార్, సాయిలు తదితరులు సన్మానించారు.

తహసీల్దార్‌కు..



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ తహసీల్దార్‌గా శ్రీకాంత్ ఇటీవలే నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. కాగ శనివారం మాజీ వైస్ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకుడు గోవింద్‌పేట్ ఈ గంగాధర్, చేపూర్ మాజీ ఎంపీటీసీ జన్నపల్లి గంగాధర్, ఫత్తేపూర్ ఎంపీటీసీ హన్మండ్లు, సాయన్న, సంతోష్‌లు మార్యాదపూర్వకంగా కలిశారు.

పర్వతారోహకుడికి..



నవీపేట : సౌత్ ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతారోహణకు వెళ్తున్న మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన ఆర్మూర్ మారుతిని సర్పంచ్ ద్యాగ సరిన్ ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం సన్మానించారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యగం చేసే మారుతి పర్వతారోహణపై ఆసిక్త చూపడంతో గ్రామస్తులు అభినందించారు. ఈనెల 8న సౌత్ ఆఫ్రికా చేరుకుని బృందంలో చేరుతానన్నారు.

ఆలయానికి సేవలు అభినందనీయం



బోధన్ : సాలూర మండలంలోని హున్సా హనుమాన్ ఆలయంలో ఉచిత సేవలందిస్తున్న గ్రామస్తుడు హన్మంత్‌రావును శనివారం ఆలయం ప్రాంగణంలో గ్రామస్తుడు ఘనంగా సన్మానించారు. ఏడేళ్లుగా ఆలయాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ఉచితంగా విధులు నిర్వర్తించడంతో పాటు పూజకార్యక్రమాలకు ఆయన సహకరించారని గ్రామస్తుడు కొనియాడారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



ఎడపల్లి(బోధన్) : మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే రోజు యోగా ఆసనాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని శిక్షకులు బాలకిషన్ పేర్కొన్నారు. శనివారం జెడ్ బుడిదివాస్ సందర్భంగా ఆచార్య బాలకృష్ణ మహారాజ్ జన్మదినం పురస్కరించుకొని జాకనంపేట గ్రామంలో పతాంజలి యోగా ధ్యాన కేంద్రంలో యజ్ఞాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి దశరథ్, చిలుక నారాయణ, ఉప్పు గంగాధర్, చిక్కల సుదర్శన్ రాజు , మిద్దె జగన్, సుమన్, రవికుమార్, సృజన్, లింగం పాల్గొన్నారు.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

బోధన్ : తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్షా విభాగంలో పని చేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది సర్వీసును క్రమబద్దీకరించాలని కోరుతు శనివారం పట్టణ కేంద్రంలోని ఆర్డీవో ఆఫీసులో సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రతినిధులు వినతి పత్రం అందించారు. సర్వీసు క్రమబద్ధీకరించే లోపు కనీస వేతన స్కేలును అమలు చేయాలని కోరారు.

విస్తుపోయేలా విస్తరణ పనులు

- ముప్కాల్ మండల కేంద్రంలో..
- అధికారులు స్పందించాలని విన్నపాలు



ముప్కాల్ మండల కేంద్రంలో సాగుతున్న డివైడర్ నిర్మాణ పనులు

బాల్కొండ : ముప్కాల్ మండల కేంద్రంలో చేపడతున్న రోడ్డు వెడల్పు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇలా సాగితే రోడ్డు వెడల్పు పనులు పూర్తయ్యేదెప్పుడో అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముప్కాల్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు, సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టడానికి ప్రభుత్వం రూ. 5 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులను గత జనవరి మాసంలో పనులు ప్రారంభించారు. కాని పనులు మూడు రోజులు ముందుకు, ఆరు రోజులు వెనక్కు అన్నట్లు సాగుతున్నాయి. పనులు శంకుస్థాపన చేయగానే వారం రోజులకే ప్రారంభమయ్యాయి. దీంతో పనులు వేగంగా పూర్తవుతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. కాని పనులు చేపట్టేలోపే అనేక వివాదాలు అలుముకున్నాయి. వీడీసీ, స్థానిక ప్రజా ప్రతినిధుల, కలసి వివాదాలకు తెరదించారు. ఇప్పటికి అక్కడక్కడా చిన్నచిన్న వివాదాలు తలెత్తుతున్నా పనులను చేస్తున్నారు. పనులు వేగంగా చేపట్టకపోవడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం రోడ్డు డివైడర్ నిర్మాణ పనులు, డబుల్ లైన్ తవ్వకాల పనులు సాగుతున్నాయి. పనులను వేగవంతం చేస్తే తప్ప పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పనులను వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎనిమిది నెలలుగా..

ఎనిమిది నెలలుగా రోడ్డును తవ్వి పనులు చేస్తున్నారు. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డును తవ్వి కంకర వేసి వదిలేశారు. రోడ్డు మీద వెళ్లాలంటే పాదచారులు జంకుతున్నారు. కొన్నిచోట్ల కల్వర్టు నిర్మాణాల కోసం తవ్వకాలు చేపట్టి వదిలేశారు. దీంతో ఓ వైపు రోడ్డు నుంచే రెండువైపుల వెళ్లేవారు ప్రయాణిస్తూ ప్రమాదాల బారీన పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పనులను వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వేగం పెంచాలని ఆదేశించాం

రోడ్డు వెడల్పు పనులను వేగవంతం చేయాలని ఆదేశించాం. వర్షాల వల్ల పనులు చేపట్టడానికి ఇబ్బందిగా ఉంది. రోడ్డు వెడల్పు పనుల్లో ఎలాంటి వివాదాలు లేవు. పనులను వేగవంతం చేసి త్వరలోనే పూర్తిచేస్తాం. పనులు కొనసాగుతున్నాయి.

– రవీందర్ రెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ, బాల్కొండ

తల్లిపాలే శ్రేయస్కరం



వర్నిలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, ఫకీరాబాద్‌లో..



తల్లిపాల వారోత్సవాలను నియోజకవర్గాల్లోశనివారం ఘనంగా నిర్వహిస్తున్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను గర్భిణులకు, బాలింతలకు అధికారులు, సిబ్బంది వివరిస్తున్నారు.



వద్యాట్‌లో మాట్లాడుతున్న అధికారిణి జ్ఞానేశ్వరి



రుద్రూర్‌లోని అంబం (ఆర్)లో..



బోధన్‌లోని గోశాల అంగన్‌వాడీ కేంద్రంలో..



నందిపేట్‌లోని కంఠంలో..

బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలి

- కార్మికుల చావులు పట్టించుకోవట్లేదు
- ఫ్యాక్టరీ ప్రైవేట్ యాజమాన్యం, ప్రభుత్వం స్పందించాలి
- బోధన్‌లో ఎన్డీఎస్ఎల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



దీక్షలో పాల్గొన్న ఎన్డీఎస్ఎల్ కార్మికులు

బోధన్ : నిజాం దక్కన్ షుగర్స్‌లిమిటెడ్ (ఎన్డీఎస్ఎల్) లేఆఫ్ కాలం నాటి నుంచి కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఎన్డీఎస్ఎల్ ప్రధాన గేట్‌కు ఎదురుగా చిన్న గుడారం ఏర్పాటు చేసుకుని కార్మికులు దీక్షలు చేపట్టారు. దీక్షలను శివసేన పట్టణ అధ్యక్షుడు ఏనుగంటి గౌతం గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఖాజా ఫయాజుద్దీన్‌లు ప్రారంభించారు. ఈ సందర్బంగా కార్మిక నాయకుడు నాగేశ్వర్‌రావు మాట్లాడుతు 2015 డిసెంబర్ 23న రాత్రికి రాత్రే ప్రైవేట్ యాజమాన్యం లేఆఫ్ నోటీస్ జారీ చేసి ఫ్యాక్టరీని మూసివేసి తొమ్మిదేళ్లు పూర్తయినా పాత బకాయిలు చెల్లించడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే షకీల్, ఎమ్మెల్సీ కవితలు స్పందించాలన్నారు. కార్మికులు రాంసింగ్, రమేష్, మోహినోద్దీన్, సజ్జన్ లాల్ దీక్షలో కూర్చున్నారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన



రుద్రూర్ : కోటగిరి, పోతంగల్ మండలాల్లో శనివారం బోధన్ రెవెన్యూ డివిజనల్ అధికారి రాజాగౌడ్ పర్యటించి ప్రభుత్వ స్థలంలో పక్కా గృహాలు నిర్మించుకుని ఉంటున్న ఇళ్లను శనివారం పరిశీలించారు. కోటగిరి మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఒకటి, పోతంగల్ మండల కేంద్రంలో 8 ఇళ్లను నిర్మించినట్లు గుర్తించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ విజయలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

వర్నిలో..

వర్ని : ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకొని నివాసముంటున్న స్థలాలను శనివారం బోధన్ ఆర్డీవో రాజాగౌడ్ పరిశీలించారు. మండలంలోని కోటయ్య క్యాంప్ జాకోర కూనిపూర్ గ్రామాల్లో 15 మంది ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్నట్లు గుర్తించారు. వర్ని తహసీల్దార్ విఠల్, ఆర్ఐ రాజేష్ ,సర్వేయర్ గణేష్ పాల్గొన్నారు.

ఆర్మూర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న మార చంద్రమోహన్ రెడ్డి

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఐకమత్యంగా ఉండి ఆర్మూర్ గడ్డపై మళ్లీ కాంగ్రెస్ జెండాను ఎగురవేద్దామని మాజీ గ్రంథాలయ చైర్మన్, నియోజకవర్గ నాయకులు మార చంద్రమోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం డొంకేశ్వర్ మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడిచిన పదేళ్లలో ఆర్మూర్ నియోజకవర్గంలో అరాచకాలు పెరిగిపోయాయని, ప్రశ్నించిన వారిపై కేసులు, బెదిరింపులు, దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే జీవన్ రెడ్డిపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ హాయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రియంబర్స్‌మెంట్, ఉచిత కరెంట్ పథకాలను బీఆర్ఎస్ ప్రవేశపెట్టి నవిగా భావించడం సరికాదన్నారు. వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు గొడిశరం భూమేశ్ రెడ్డి, మంద మహిపాల్, రవి ప్రకాశ్, తదితరులున్నారు.

గవర్నర్ ఆర్టీసీ బిల్లును ఆమోదించాలి



ఆర్మూర్ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఆర్మూర్‌టౌన్ : తెలంగాణ ప్రభుత్వం పంపించిన ఆర్టీసీ బిల్లు గవర్నర్ అమోదించాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్ కార్యదర్శి రవి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఏదుట తెలంగాణ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేస్తున్న బిల్లును గవర్నర్ ఆపడం సరికాదన్నారు. ఆర్టీసీ డిపో ఎదుట 2 గంటల పాటు బస్సులను నిలిపివేసి అనంతరం విధుల్లోకి చేరారు. మజ్దూర్ యూనియన్ డిపో ఉపాధ్యక్షుడు ధర్మారాజు, కోశాధికారి శ్రీనివాస్, కమ్మర్‌పల్లి రవి, గంగామణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : ఆర్టీసీ విలీనం బిల్లును గవర్నర్ ఆమోదించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి కార్మికులు ధర్నా చేపట్టారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు డిపో లోపల నుంచి బయటకు వెళ్లకుండా గేట్ వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. గవర్నర్ బిల్లును ఆమోదించాల్సిందేనన్నారు. లేని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వెల్లడించారు. డిపో అధికారులు, కార్మికులు బీఎస్ రావు, సుదర్శన్, అలీముద్దీన్, సావిత్రి, సంజీవ్ రెడ్డి, ముబీన్,బీఆర్ఎస్ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు రవి శంకర్ గౌడ్ పాల్గొన్నారు.



బోధన్ ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు, ఉద్యోగుల ధర్నా

నాసిరకం చెక్‌డ్యాంలతో రైతులకు నష్టం



భీమ్‌గల్ : నాసిరకంగా నిర్మించిన చెక్‌డ్యాంలతో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ అన్నారు. ఇటీవల కురిసిన బారీ వర్షాలకు ధ్వంసమైన భీమ్‌గల్, బెజ్జోర, గోన్‌గొప్పులలో నిర్మించిన చెక్‌డ్యాంను కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ శనివారం పరిశీలించారు. వర్షాల కారణంగా రైతులు నష్టపోతుంటే మంత్రి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ అసలు నష్టమేమీ జరగలేదంటూ అసెంబ్లీలో చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎకరానికి రూ. 30వేల నష్టపరిహారం ఇవ్వాలని, చెక్‌డ్యాంల వల్ల నష్టపోయిన వారికి న్యాయం చేయాలని, మంత్రి స్పందించకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామన్నారు. ఈ పరిశీలనలో సునీల్ వెంట పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, వాక మహేష్, జేజే సర్సయ్య, కార్యకర్తలు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



బోధన్ : శాంతిభద్రతల పరిరక్షణ, నేరసంఘటన పరిశోధనకు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే పోలీసు అధికారులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ సూచించారు. శనివారం పట్టణ కేంద్రంలోని కోర్టులో డివిజన్ స్థాయి పోలీసు అధికారులకు చట్టాల పై అవగాహన సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, అడిషన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్యలు నేర పరిశోధన, సాక్ష్యాధారాలకు సంబంధించి చట్టపరమైన కీలక అంశాలను వివరించారు.సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీచర్ మృతి

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం సాయంత్రం పాలిటెక్నిక్ ఉపాధ్యాయుడు పోగుల రవి(40) గుండెపోటుతో మృతిచెందాడు. పట్టణంలోని రంగాచారి కాలనీకి చెందిన పోగుల రవి నందిపేటలోని పాలిటెక్నిక్ కళాశాలలో విధులు నిర్వహించి బస్సులో తిరిగి ఆర్మూర్ బస్టాండ్‌కు చేరుకున్నారు. బస్సు ఆగినప్పటికీ ఆయన దిగకపోవడంతో కండక్టర్ కదిపినప్పటికీ చలనం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు స్థానిక ఆస్పత్రిలో చేర్పించినప్పటికీ ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రభుత్వాస్పత్రికి ఆధునిక హంగులు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్‌లోని ఏరియా ఆస్పత్రిని కార్పొరేట్ ఆస్పత్రి తలపించేలా అభివృద్ధి చేసిన ఘనత ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికే దక్కుతుందని పట్టణ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు పృథ్వీరాజ్, టెలికాం డైరెక్టర్ షాహిద్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని శనివారం బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు సందర్శించారు. బీఆర్ఎస్ యువజన నాయకులు మీర శ్రావణ్, అగ్గుక్రాంతి, జబ్రీ, లతీఫ్, నరేందర్, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

వణ్యప్రాణుల సంరక్షణపై అవగాహన



నందిపేట్ (ఆర్మూర్) : మండలంలోని తల్వేద ఉన్నత పాఠశాలలో వన్యప్రాణులు, అడవుల సంరక్షణపై శనివారం అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్ తల్వేద, లక్కంపల్లి యువకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవులను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదన్నారు. స్నేక్ క్యాచర్ మున్నా పాములపై అవగాహన కల్పించారు. తల్వేద సర్పంచ్ పెర్కిట్ చందన సాయిరెడ్డి, హెచ్‌ఎం రమణారెడ్డి తదితరులున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ కార్యవర్గం ఎన్నిక

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జేఏసీ అధ్యక్షురాలిగా వి గంగామణి, ఉపాధ్యక్షురాలిగా పి లత, కార్యదర్శిగా కే రాధ, కోశాధికారిగా రఘువీర్ సింగ్, సభ్యులుగా శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు.

12న బోధన్‌లో 2కే రన్

బోధన్ : యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 12న పట్టణ కేంద్రంలో నేషనల్ వెజిటేరియన్ మూవ్‌మెంట్ వ్యవస్థాపకులు ఆచార్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో వెజిటేరియన్ 2 కే రన్ వెయ్యి మంది విద్యార్థులతో నిర్వహించనున్నట్లు స్థానిక జాతీయ శాఖాహార అంబాసిడర్స్ కమలకుమారి, అప్పల నాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత



వేల్పూర్ : వేల్పూర్ మండలం పడగల్ గ్రామానికి చెందిన కే మల్లారెడ్డి నిమ్స్ ఆస్పత్రిలో చేరడంతో చికిత్స కోసం రూ 2 లక్షల ఎల్‌వోసీని మంత్రి ప్రశాంత్ రెడ్డి శనివారం హైదరాబాద్‌లో అందజేశారు.

జీపీ తనిఖీ

బాల్కొండ : మెండోరా మండలం పోచంపాడ్‌లోని జీపీని శనివారం ఎంపీడీవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. జీపీలో రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్ను వసూలు వివరాలను, పారిశుద్యం పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మిస్బా, తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ తరలిన బీజేపీ నాయకులు



ఆర్మూర్ టౌన్ : ఆర్మూర్ పట్టణంకు చెందిన బీజేపీ నాయకులు హైదారబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించే అధికార ప్రతినిధుల, మీడియా కన్వీనర్ల వర్క్‌షాప్ సమావేశానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి జిల్లా మీడియా ఇన్‌చార్జిలు స్వామియాదవ్, జశ్వంత్, లింగం. సందీప్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నోట్‌బుక్కుల పంపిణీ

పెర్కిట్(ఆర్మూర్) : శ్రీరామ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు 280 నోట్‌బుక్కులు, 240 పెన్నులను 70 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. సేవా సంస్థ అధ్యక్షులు తంగళ్లపల్లి శ్రీనివాస్ , కోశాధికారి టి రామ్‌మోహన్, సభ్యులు ప్రసాద్, ఎం రామ్, టి శ్రీనివాస్ తదితరులున్నారు.

పేదలకు బియ్యం..

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని విద్యాహైస్కూల్‌లో శనివారం రక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అవ్వకు బువ్వ కార్యక్రమంలో భాగంగా 48 మంది పేద వృద్ధులకు 5 కిలోల చొప్పున బియ్యం అందజేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఖాందేష్ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి విద్యా ప్రవీణ్‌పవార్, ఉపాధ్యక్షుడు నరహరి, బేతు గంగాధర్ ఉన్నారు.

నిరుపేదలకు నిత్యావసరాలు..

నవీపేట : మండలంలోని నాగేపూర్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబాలను తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బియ్యం, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. బోధన్ మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మావతి చేతుల మీదుగా ఈ పంపిణీ చేశారు. నాగేపూర్‌లో 16 కుటుంబాలకు సరుకులు పంపిణీ చేశామన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం కార్యవర్గం ఎన్నిక

బోధన్: సాలూర మండల నాయీ బ్రాహ్మణ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం విఠల్, ఉపాధ్యక్షుడిగా సాయిలు, ప్రధాన కార్యదర్శిగా నగేష్, కార్యదర్శిగా చంద్రకాంత్, కోశాధికారిగా ఎం సాయిలు, గౌరవ అధ్యక్షుడిగా గురునాథ్ ఎన్నికయ్యారు.

సమ్మెకు సంఘీభావం

నవీపేట : గత 31 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న జీపీ కార్మికులకు మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి శనివారం సంఘీభావం తెలిపారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం వెనుకంజ వేయడం విడ్డూరంగా ఉందన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలి రాజకీయ యుద్ధభేరికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 13న కోరుట్లలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాసరి వెంకటేశ్, కపిల్, నాగాభూషణం, పెండెం జీవన్, గుర్రం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు సన్మానం..

ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ ఆర్డీవోగా వినోద్‌కుమార్, తహసీల్దార్ శ్రీకాంత్‌లు ఇటీవలే నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. శనివారం వీరిరువురిని ఉమ్మడి ఆర్మూర్ రూరల్ రేషన్ డీలర్ల అధ్యక్షుడు మల్లెల గంగారాం, ప్రధాన కార్యదర్శి కామని నరేష్, క్యాషర్ సుద్దపల్లీ సురేష్, ఉపాధ్యక్షులు అజీమ్, డీలర్లు లింగమయ్య, రమేష్ రెడ్డి, కిషన్, రాజలింగం తదితరులున్నారు.

లైన్‌మన్ కుటుంబానికి ఆర్థికసాయం

పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మున్సిపల్ పరిదిలోని పెర్కిట్‌కు చెందిన ట్రాన్స్‌కో లైన్‌మెన్ మంగళ్‌చంద్ రాథోడ్ కుటుంబానికి స్థానిక వెంకటేశ్వర్ గార్డెన్ ఫంక్షన్ హాల్ యజమాని నరహరి రూ. లక్షను శనివారం ఆర్థిక సహాయంగా అందజేశారు. పెర్కిట్‌కు చెందిన మంగళ్‌చంద్ రాథోడ్ ఆరు నెలల క్రితం విది నిర్వహణలో ఉండగా విద్యుదాఘాతం సంభవించి మృతి చెందాడు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – బ్రో(తెలుగు)2డీ-11.00, 1.55, 4.50,7.45, 10.40

స్క్రీన్-2 – మెగ్(తెలుగు) – 10.45, 1.25, 7.20, 10.00; ఎల్‌జీఎమ్(తెలుగు)- 4.05

స్క్రీన్-3 – రాఖి ఔర్ రాణికి ప్రేమ్ కహానీ – 10.05, 7.00,10.35, మిస్టేక్ 4.35

స్క్రీన్-4 – బేబి(తెలుగు) -11.10, 6.30, ఓపెన్ హైమర్(ఇంగ్లీష్) 2.40, ఎల్‌జీఎం 10.00